

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,51,415లు, బంగారం 250 మిల్లీగ్రాములు, వెండి 9గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కనువిందుగా కల్యాణం

సీతారాముల కల్యాణ మహోత్సవం కనువిందుగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- 8లో



అండర్-15 ఫుట్‌బాల్..

అండర్-15 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

తెలుగు ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



ఎ.ప్రసాదరావు(ఫైల్)

జయపురం: జయపురంలో ప్రముఖ తెలుగు ఉపాధ్యాయులు, పట్టణంలో అన్ని భాషల ప్రజలకు చిరపరిచితులైన ఎ.ప్రసాదరావు మాస్టార్ కన్నుమూశారు. ఈయన మరణంతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. జయపురంలో ఆబాల గోపాలం వరకు గేష్ మాస్టారుగా పిలువబడే ప్రసాదరావు (86) పట్టణంలోని తన నివాసంలో సోమవారం మరణించారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న అభిమానులు, ప్రముఖులు వచ్చి మృతదేహాన్ని దర్శించుకొని నివాళులర్పించారు. ఆయన ఉపాధ్యాయ ఉద్యోగం నుంచి రిటార్తెన తరువాత గ్యాస్ పొయ్యిలు మరమ్మతులు చేయటం ద్వారా మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన విద్యా ప్రగతికి అందించిన సేవలకు, మెచ్చి జయపురం ప్రజ్ఞాభారతి సంస్థతో పాటు పలు సంస్థలు ప్రసాదరావుకు సన్మానాలు చేసి గౌరవించాయి. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

బలిమెల సమస్యలపై సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మంగుఖీలో

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో మంగళవారం బలిమెల ప్రాంతంలోని సమస్యలపై సీఎం మోహన్ చరణ్ మఝికి భువనేశ్వర్‌లో వినతి పత్రం అందజేశారు. బలిమెల నగరంలో ఈ -లైబ్రరీ నిర్మాణం, మినీ స్టేడియం వద్ద గ్యాలరీ నిర్మాణం గురించి వివరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న బస్సు ముందరి భాగం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పరిధి శాంతినగర్ వద్ద సోమవారం బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. కల్యాణ సింగుపూర్ నుంచి బిసంకటక్, మునిగుడ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సు శాంతినగర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి చెట్టుకు బలంగా ఢీకొంది. దీంతో బస్సు ముందరిభాగం నుజ్జునుజ్జయ్యింది. బస్సులో 56 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో ఎవరికీ ఎటువంటి గాయాలవ్వలేదు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద సహిల్ మృతదేహం, (ఇన్‌సెట్లో) రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కంగుర్‌కొండ పంచాయతీ ఎం.వి.24 గ్రామం వద్ద మంగళవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కలిమెల సమితికి చెందిన సహిల్ కబిరేష్ (36) బైక్‌పై కలిమెల నుంచి మల్కన్‌గిరి వైపు వస్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి సహిల్ కిం రాళ్లపై పడిపోయాడు. గమనించిన స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. ప్రమాద సమాచారాన్ని కలిమెల పోలీసులకు ఇవ్వగా.. ఐఐసీ చంద్రకాంత్ మల్కన్‌గిరి చేరుకొని మృతుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోద్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

- ప్రారంభమైన మజ్జిగౌరి వార్షిక ఉత్సవాలు
- నునాబేసోలో అమ్మవారి దర్శనం

వైభవం.. చైత్రోత్సవం



నదీ జలాలను తీసుకొస్తున్న కమిటీ సభ్యులు

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రాంభమయ్యాయి. స్థానిక జంఝావతి నది నుంచి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, పెద్దిన వాసు, వడ్డాది శ్రీనివాస్‌రావుల దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీసుకొచ్చిన శుద్ధ జలాలను మందిరంలో ఉంచడంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాంప్రదాయబద్ధంగా ఉదయం సూర్య ఆవాహన పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గంజాం జిల్లా కవిసూర్యనగర్ నుంచి వచ్చిన ప్రత్యేక పూజారుల బృందం ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి.



సునాబేసోలో దర్శనమిస్తున్న అమ్మవారు

నేటి నుంచి ఘటాల ఊరేగింపు

అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు బుధవారం నుంచి పట్టణంలో ఊరేగిస్తారు. మంగళవారం రాత్రి పూజారులు అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పాదాలను తీసుకొచ్చి గర్భగుడిలో నిలుపుతారు. అనంతరం వాటిని గర్భగుడి సమీపంలోని వేరే గదిలో భక్తుల సందర్శనం కోసం ఉంచుతారు. అదేవిధంగా అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను అదే ప్రాంతంలో ఉంచి ప్రత్యేకంగా పూజిస్తారు.

సునాబేసోలో అమ్మవారు

చైత్రోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. దీనినే సునాబేసో అంటారు. సోమవారం అర్ధరాత్రి ఈ అలంకరణ కార్యక్రమాలను ఆలయ ప్రధాన పూజారులు చంద్రశేఖర్ బెరుకొ, బబులా బెరుకొలు నిర్వహించడంతో మంగళవారం నుంచి అమ్మవారు సునేబేసోలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ఐదు రోజులూ అమ్మవారు సునాబేసోలోనే భక్తులకు దర్శనం ఇస్తారు. మంగళవారం కావడంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆంధ్రప్రదేశ్, ఇటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి బారులుతీరారు.

మజ్జిగ వితరణ

ఉత్సవాల సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో నిర్వాహక కమిటీ సభ్యులు ఉచితంగా భోజన సౌకర్యాలతో పాటు మజ్జిగ, ప్రసాదాలు వితరణ చేస్తారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన మరమరాలతో తయారు చేసే ప్రసాదాలను సమర్పించడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో ప్రత్యేకంగా వీటిని మహిళలు సమర్పిస్తారు.



ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ప్రవేశద్వారం



మందిరం ప్రాంగణంలో మజ్జిగ వితరణ

యువకుడి అవయవ దానం



ఆశిష్ సింగ్



చివరి దశలో ఆశిష్



అవయవాలు తరలిస్తున్న దృశ్యం



ప్రమాదం జరగడానికి ముందు ఆశిష్ తీసుకున్న ఫొటో



చెన్నైకి వెళ్తున్న అవయవాలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా దమంజోడి సమీపంలోని మత్తలాపుట్ గ్రామానికి చెందిన అశిష్ సింగ్ (20) ఈ నెల 1వ తేదీన సునాబెడా పట్టణంలోని బీ జోన్‌లో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ముందు సునాబెడాలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ షహీద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో 2వ తేదీన విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఆశిష్ సింగ్ బ్రెయిన్ డెత్‌కి గురయ్యారు. అతడి తండ్రి 2021లో, తల్లి 2024లో మృతి చెందారు. దీంతో అతడు తన అక్క సస్మితా సింగ్‌తో కలిసి ఉండేవాడు. ఇటీవలే సునాబెడా హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్‌లో ఇంటర్న్‌షిప్ చేయడం ప్రారంభించారు. విధుల నుంచి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. యువకుడు బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడని తెలియగానే.. అక్కడి వైద్య బృందం బాధితుడి సోదరి సస్మితాకి అవయవదానంపై అవగాహన కల్పించారు. అవయవ దానం చేస్తే అశిష్ మృతి చెందినా మరికొందరిలో జీవిస్తాడని వివరించారు. పుట్టెడు దుఖంలోనూ సస్మిత తమ్ముడి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో సోమవారం ఆశిష్ శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్, పాంక్రియాస్, స్మాల్ బౌల్ తీశారు. వాటిని జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియారిటీ ఆధారంగా అర్హులకు కేటాయించారు. ఆశిష్ మృతదేహానికి ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు, అధికారులు పూలు జల్లి నివాళులు అర్పించారు.

సత్తిగూడ జలాశయంలోకి 54వేల రొయ్యపిల్లలు



సత్తిగూడ జలాశయంలో రొయ్య పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

మల్కన్‌గిరి : జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్తిగూడ జలాశయంలో మంగళవారం జిల్లా మత్స్యశాఖ వారు 54వేల రొయ్యపిల్లలను విడుదల చేశారు. ఇవి సక్రమంగా పెరిగితే కిలో రూ.500 వరకు ధర పలుకుతుందని తెలిపారు. చేపల కంటే ఇవి ధర ఎక్కువ పలుకుతాయని మత్స్యశాఖాధికారి సుశాంతా గౌడ్ తెలిపారు. అలాగే జలాశయంలోకి మరికొన్ని నాటు పడవలు మంజూరు చేశారు. గత నెలలో కూడా చిత్రకొండ జలాశయంలో కూడా ఇలాగే రొయ్య పిల్లలు వదిలారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ ఏఎఫ్ఓ ముఖేష్ మాఝి, మనోజ్ కుమార్ జాన తదితరులు పాల్గొన్నారు.

ప్రదీప్ కుమార్ జెనా ప్రమాణ స్వీకారం



ప్రదీప్ కుమార్ జెనాతో ఓఈఆర్‌సీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి



ఓఈఆర్‌సీ చైర్మన్‌కు గవర్నర్ అభినందనలు

భువనేశ్వర్: ఒడిశా విద్యుత్ నియంత్రణ సంఘం ఓఈఆర్‌సీ చైర్మన్‌గా ప్రదీప్ కుమార్ జెనా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక రాజ్ భవన్ సముదాయంలో మంగళవారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రదీప్ కుమార్ జెనా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి హోదాలో ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలతో చిన్నారులు

రాయగడ: పాఠశాలల్లో కొత్తగా చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్న ఒకటో తరగతి విద్యార్థులకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని మాధ్యమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సమితి విద్యాశాఖ అధికారి వంగ్రాహి సాబొరొ, విద్యాశాఖ సిబ్బంది పంపిణీ చేశారు. విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు.

ముమ్మరంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



ఆలయ ప్రాంగణాన్ని శుభ్ర పరుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



పూర్ణఘడ్ ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

జయపురం: ఒడిశా పక్ష పాలన సందర్భంగా జయపురం మున్సిపాలిటీ పారిశుద్ధ్య అభిజాన్ నిర్వహించింది. మంగళవారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బందితో పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. జయపురం పూర్ణఘడ్ ప్రాంతంలో పారిశుద్ధ్య అభిజాన్ సందర్భంగా దక్షిణ కాళికా మందిరం, నీలకంఠేశ్వర ఆలయం, అయ్యప్ప మందిరం, బాల గణపతి ఆలయ ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



యాత్రకు వెళ్తున్న వృద్ధులు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారీ

రాయగడ: ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండే వయో వృద్ధులను ప్రభుత్వం తీర్థయాత్రలకు తీసుకెళ్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఫరుల్ పట్వారీ సూచించారు. మంగళవారం రాయగడ నుంచి 775 మంది వయోవృద్ధులు అయోధ్య, వారణాసి వంటి పుణ్యక్షేత్రాలకు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైలును ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయంలో సామూహిక ఉపనయనం



లింగరాజు మహా ప్రభువుని దర్శించుకున్న బ్రహ్మచారి సన్యాసులు



సామూహిక ఉపనయనంలో పాల్గొన్న బాల బ్రహ్మచారులు

భువనేశ్వర్: స్థానిక శ్రీ నీలకంఠేశ్వర్ ఆలయ ప్రాంగణంలో సామూహిక ఉపనయనం నిర్వహించారు. వేద పారాయణంతో ప్రారంభించి, చతుర్విధ కర్మలు, బిక్ష స్వీకరణ వంటి సంప్రదాయ ఆచార వ్యవహారాలతో ఉపనయనం సామూహికంగా నిర్వహించారు. అనంతరం బ్రహ్మచారి సన్యాసులు ఊరేగింపుగా వెళ్లి లింగరాజుని దర్శనం చేసుకున్నారు. గత 14 ఏళ్లుగా నిరవధికంగా ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది భువనేశ్వర్, పరిసర ప్రాంతాలతో పాటు కటక్, జాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి మొత్తం 16 మంది బ్రాహ్మణ పిల్లలు సామూహిక ఉపనయనంలో పాల్గొన్నారు.

సర్వత్రా చైత్రశోభ



కొరాపుట్‌లో జంతువులను భయపెట్టడానికి బూర ఊదుతున్న గిరిజనుడు



దాబుగాంలో అమ్మవారి ఊరేగింపు విచిత్ర వేషధారణ



కొరాపుట్ జిల్లాలో గిరిజన బాలురు వేట నృత్యాలు



బెంగాళీ శరణార్థ గ్రామం యువి 52 లో కాళీ అమ్మవారి పూజ పెండల్ వద్ద మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల మొత్తం చైత్ర శోభ నెలకొంది. ఉత్కళ సంప్రదాయం ప్రకారం చైత్ర మాసంలో ప్రతి అమ్మవారి గుడి చైత్ర మాస పూజలు చేయాలి. అందులో ముఖ్యంగా గ్రామ దేవతకి శాంతి చేయాలి. దీంతో ప్రతి ఊర్లో పండగ వాతావరణం నెలకొంది. గిరిజన బాలలు వేటకు వెళ్లే విధంగా శబ్దాలు చేస్తూ, రంగులు వేసుకొని వీధులలో నృత్యాలు చేస్తున్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విద్యా మంత్రి నిత్యానంద గొండో ఉమ్మర్ కోట్ లో, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తన నియోజకవర్గంలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



నబరంగ్‌పూర్‌లో బుడి ఠకురాణి అమ్మవారి ఊరేగింపులో ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

క్లుప్తంగా

ఆనంద్ బజార్‌లో గాయపడిన పోటు కార్మికుడు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ మందిరం సముదాయం ఆనంద బజార్ ప్రాంగణంలో పోటు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. బాధిత కార్మికుడు బలభద్ర ప్రధాన్‌గా గుర్తించారు. ఆయన చంద్రపూర్ పోలీస్ ఠాణా పరిధి తొలొజొంఘి గ్రామస్తుడు. మూల విరాట్లకు నివేదించిన మహా ప్రసాదాలను నెత్తిన మోసుకుని ఆనంద్ బజార్ ప్రాంగణానికి తరలిస్తుండగా వేడి పప్పు, అన్నం అతని శరీరంపై ఒలగడంతో గాయపడ్డాడు. తక్షణమే చికిత్స కోసం పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. ఆనంద బజార్ ప్రాంగణంలో నిత్యం స్వామి వారికి నివేదించిన మహా ప్రసాదాలను భక్తులకు విక్రయిస్తారు.

వంతెన కింద మంటలు



రఘునాథ్‌పూర్ వంతెన కింద చెలరేగిన మంటలు

భువనేశ్వర్: ఖుర్దా రఘునాథ్‌పూర్ వంతెన కింద మంటలు చెలరేగాయి. సుమారు 2 గంటలు పైబడి మంటలు నిరవధికంగా రగిలాయి. స్థానిక చంద్రశేఖర్ పూర్ అగ్ని మాపక దళానికి చెందిన 2 యూనిట్ల యంత్రాంగం నిర్విరామంగా శ్రమించి మంటలు నివారించింది. ఈ సంఘటనతో నందన్‌కానన్ రోడ్డుకు ఒక వైపున వాహనాల రవాణా స్తంభించి పోయింది. ఈ పరిసరాల్లో 33 కేవీ విద్యుత్ లైన్ ఉండడంతో దీని పరిధిలో విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా నిలిపివేశారు. భద్రతా చర్యలో భాగంగా ఈ మేరకు నిర్ణయించినట్లు విద్యుత్ పంపిణీ సంస్థ ప్రకటించింది. వంతెన కింద చెత్త కుప్పకు ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు.

ఏఐసీసీ సమావేశాలకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



సమావేశ వేదిక వద్ద సీఎల్‌పీ నాయకుడు రాం చంద్ర ఖడం, పీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్, రాష్ట్ర పరిశీలకుడు అజయ్ కుమార్

కొరాపుట్: గుజరాత్ రాష్ట్ర రాజధాని అహ్మదాబాద్‌లో జరగనున్న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రత్యేక సమావేశాలకు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి అసెంబ్లీ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర సీఎల్‌పి నాయకుడు రాంచంద్ర ఖడం ఏఐసీసీ సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ కలహండి జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రదేశ్‌కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు అజయ్ కుమార్ లల్లూతో భేటీ అయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన యువ ఏఐసీసీ సభ్యురాలు మానషా త్రిపాఠి తన బృందంతో అహ్మదాబాద్‌లోని సీబ్ల్యూసీ సమావేశాలు జరిగే సర్దార్ వల్లబాయ్ పటేల్ మెమోరియల్ కేంద్రానికి చేరుకున్నారు.

అడవులను కాపాడాలని ప్రచారం



మండిమర వారపు సంతలో అటవీ శాఖ అధికారుల సచేతన కార్యక్రమం

పర్లాకిమిడి: అడవులను కాపాడాలని సంబంధిత అధికారులు ప్రచారం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టొద్దని మోహానా అటవీ రేంజ్ అధికారులు గజపతి జిల్లా మోహానా బ్లాక్ నలాఘాట్ సెక్షన్ మండిమర వారపు సంతలో మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. జిల్లాలో మోహానా బ్లాక్‌లో అటవీ ప్రాంతాల్లో నిప్పు రాజుకున్న ప్రాంతాలను శాటిలైట్ ద్వారా గుర్తించి మంటలను అదుపుచేశారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడం వల్ల అనేక వృక్షాలు, వన్యప్రాణులు నాశనం అవుతాయని, పర్యావరణానికి ముప్పు సంభవిస్తుందని మంద్రబజు, నలాఘాట్, మండిమర గ్రామాల్లో అటవీ శాఖ బృందం ఫారెస్టు ఫైర్ సచేతన కార్యక్రమం చేపట్టారు.

అలరించిన కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పర్లాకిమిడి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్థానిక మార్కెట్ జంక్షన్ కోమటివీధి వద్ద రామాలయం ఆవరణలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. కళాకారులు రేఖానా వీధికి చెందిన వేణిషా కూచిపూడి ఆర్ట్ అకాడమికి చెందిన వేణిషా పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అందవరపు శ్రీనివాసరావు, పైడి శెట్టి నగేష్ తదితరులు సాంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలాగే సింకివీధిలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపారు.



పసుపు దంచుతున్న ముత్తైదువులు



పసుపు వస్త్రాలు తయారు చేస్తూ..

కనువిందుగా సీతారాముల కల్యాణ మహోత్సవం



సీతారాముల వివాహ మహోత్సవాన్ని జరుపుతున్న దంపతులు



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మహిళలు



శంఖం పూరిస్తున్న బాలుడు

జయపురం: స్థానిక జమాల్ లైన్‌లోని శ్రీరామ మందిరంలో చైత్రమాస శుద్ధ ఏకాదశి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వారణాశి సత్యనారాయణ దంపతులు, సుంకరి ఈశ్వరరావు దంపతులు సంయుక్తంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. మరో ఎనిమిది మంది దంపతులు పాల్గొన్నారు. ముందుగా ముత్తైదువులు పసుపుదంచారు. ఆలయ అర్చకులు ఉలిమిరి నాగేశ్వరరావు, పట్టణ పురోహితులు గన్నవరపు కోటీ వరప్రసాద్‌లు సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించగా.. భారీగా హాజరైన భక్తులు ఈ సుందర దృశ్యాన్ని కనులారా వీక్షించి తరించిపోయారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు గోరపల్లి నాగరాజు 'సాక్షి'తో మాట్లాడుతూ.. జమాల్ లైన్ శ్రీరామ నవమి ఉత్సవాలకు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. వందేళ్ల కిందట పట్టణంలో తెలుగు పెద్దలు శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణ మహోత్సవాలు ప్రారంభించారని.. ఆనాటి నుంచి ఏటా దీన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఉత్సవాలకు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తున్నారని.. వారందరికీ శ్రీరామ మందిర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.



బంగారు మంగళ సూత్రాలు తీసుకు వస్తున్న భక్తులు



శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అలరించిన షణ్ముఖ శర్మ ప్రవచనాలు



హాజరైన ప్రజలు



రాణిపేటలో ప్రవచనములు చెబుతున్న సామవేదం షణ్ముఖ శర్మ

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి రాణిపేట గ్రామంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మచే మహాభారతంలో భీష్మాచారుని బోధ ప్రవచనములు సోమవారం నుంచి చెబుతున్నారు. మహాభారతంలో లేనిది ఎక్కడా లేదని, ప్రపంచమంతా ఉన్నది ఈ మహాభారతంలోనే.. అని అయన తన ప్రవచనాలలో అన్నారు. దేబాబ్రతుడు తదనంతరం తన తల్లి గంగ వద్ద కురువంశం రక్షిస్తానని మాట ఇచ్చిన మేరకు ప్రతిజ్ఞ చేయడంతో భీష్మునిగా పేరుగాంచాడని అన్నారు. పర్లాకిమిడిలో క్రిష్ణచంద్ర గజపతి కళాశాలలో ఎంఏ తెలుగు విద్యాభ్యాసం చేసిన సామవేదం షణ్ముఖ శర్మ అందరికీ సుపరిచితుడు. ఆయన తండ్రి కీ.శే.సామవేదం రామమూర్తి శర్మ తెలుగు పండిట్‌గా పని చేస్తూ ప్రవచనములు చెబుతుండేవారు. తెలుగు చిత్ర సీమలో అనేక సినిమాలకు పాటల రచయితగా కూడా కొంతకాలం పనిచేశారు. అనతి కాలంలో తెలుగు చిత్రసీమకు స్వస్తి పలికిన సామవేదం షణ్ముఖ శర్మ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రవచనములు చెబుతూ ఎలలేని ఖ్యాతిని ఆర్జించారు. ఈ కార్యక్రమం ధన్వంతరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 11వతేదీ వరకూ జరుగుతుందని చిరంజీవులు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైత్ర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి జింక



అధికారి నివాసానికి వచ్చిన జింక

పర్లాకిమిడి: తాగునీటి వనరులు లేకపోవడంతో జంతువులు జనవాసాల్లోకి వస్తున్నాయి. మహేంద్ర తనయ నదిలో నీరు అడుగంటిపోవడంతో సోమవారం మధ్యాహ్నం ఓ కణితి (సాంబారు జింక) తాగునీటి కోసం గుసానిసమితి అభివృద్ధి అధికారి గౌరచంద్ర పట్నాయిక్ నివాసానికి వచ్చింది. ఆయన వెంటనే తా అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి జింకను అడవుల్లో సురక్షితంగా వదిలిపెట్టారు.

రాధా కృష్ణుల విగ్రహ ప్రతిష్టాపన



ధాన్యాధివాసంలో రాధా కృష్ణుల విగ్రహం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ అకౌంట్సు కాలనీ బాలాజీ మందిర సముదాయం అంచెలంచెలుగా బహుళ దేవుళ్ల ప్రాంగణంగా విస్తరిస్తోంది. ఈ దేవస్థానంలో ప్రధాన ఆరాధ్య దైవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి నిత్య పూజలు అందుకుంటున్నాడు. కొత్తగా ఈ సముదాయంలో రాధా కృష్ణుల విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవంలో భాగంగా నూతన విగ్రహాలకు దాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం, పుష్పాధివాసం, షయాధివాసం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం రాధాకృష్ణుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నట్లు కార్యదర్శి జేకే రావు తెలిపారు.

ప్రయాణికుల బస్సు దగ్ధం



మంటల్లో చిక్కుకున్న ప్రయాణికుల బస్సు



ఘటనా స్థలం పరిసరాల్లో ట్రాఫిక్ ప్రతిష్టంభన

భువనేశ్వర్: ప్రయాణికుల బస్సు మంటల్లో దగ్ధమైంది. పూరీ–భువనేశ్వర్ జాతీయ రహదారిపై పూరీ మాలతీపట్టపూర్ బస్టాండ్ సమీపంలో ఈ ప్రమాదం మంగళవారం చోటు చేసుకుంది. అగ్ని ప్రమాదానికి కారణం అస్పష్టంగా ఉండడంతో పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రమాద సమయానికి బస్సు ఖాళీగా ఉండడంతో పెను ముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక అగ్ని మాపక శాఖ రంగంలోకి దిగి మంటలు నివారించింది. అగ్ని ప్రమాదం తీవ్రతతో పరిసరాల్లో మోటారు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రాయగడలో భారీ వర్షం



వర్షంతో నిండిపోయిన కల్యాణసింగుపూర్‌లో ఒక ఇంటి ప్రాంగణం

రాయగడ: జిల్లాలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కళ్యాణసింగుపూర్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా గల చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. రాయగడ పట్టణంలో సుమారు గంటన్నర సమయం కుండపోత వర్షం కురిసింది. స్థానిక రైతుల కాలనీ, ఆర్‌కే నగర్, కస్తూరీ నగర్ తదితర ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అండర్-15 ఫుట్‌బాల్ పోటీలు



కొరాపుట్ లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యేలు రుపుదర్ బోత్ర, రఘురాం మచ్చో

- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉత్సాహం చూపిన క్రీడాకారులు



కొరాపుట్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న బాలురు



ఉమ్మర్‌కోట్‌లో పోటాపోటీగా తలపడుతున్న క్రీడాకారులు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో సీఎం ట్రోఫీ అండర్–15 ఫుట్ బాల్ పోటీలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో లాంఛనంగా ప్రారంభించారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్రలు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రకటించారు. మరో వైపు నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో సీఎం ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో 15 ఏళ్లలోపు బాలురు పాల్గొంటారని నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 15వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ, విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండో, జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎంపీ బలబద్ర మజ్జి, ఎంఎల్ఏలు గౌరీ శంకర్ మజ్జి(నబరంగ్‌పూర్), నర్సింగ్ బోత్ర(జొరిగాం) పాల్గొన్నారు.



ఉమ్మర్‌కోట్ లో క్రీడాకారులతో మంత్రి నిత్యానంద, కలెక్టర్ శుభంకర్, ఎంపీ బలబద్ర మజ్జి, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్, నర్సింగ్ బోత్రలు

సందడిగా ఆటల పోటీలు



పీఎం శ్రీ వార్షిక ఆటల పోటీల్లో సూచనలిస్తున్న పీఈటీ

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాల మైదానంలో పీఎం శ్రీ వార్షిక ఆటల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలలో వందమీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్, కబాడీ, మ్యూజికల్ ఛైర్, స్లోసైకిల్ రేస్, స్కిప్పింగ్ లెమన్ రేస్ పోటీలను శిక్షకులు నిర్వహించారు. ఈ పీఎం శ్రీ వార్షిక పోటీలను ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు యస్.కిరణ్ ప్రారంభించగా, శిక్షకులు మహేంద్ర బోడోముండి, ఇతర శిక్షాయిత్రిలు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలకు పాఠశాల వార్షిక దినోత్సవంలో అందజేస్తామని హెచ్‌ఎం కిరణ్ తెలియజేశారు.

సమీకృత వ్యవసాయం ద్వారా అధిక లాభాలు



సంబల్‌పురి డ్యాన్సులో అగ్రికల్చర్ కళాశాల విద్యార్థిని దిలీప్ బరాల్



ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న రైమతీ ఘురియా

పర్లాకిమిడి: సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని సెంచూరియన్ వర్సిటీ ఎంఎస్ స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల డీన్ సత్యప్రకాష్ నంద అన్నారు. వ్యవసాయ విద్యార్థులు ఆధునిక యంత్రాలు, మెలకువలు తెలుసుకుని వ్యవసాయ క్షేత్రం, ల్యాబ్‌కు మధ్య వ్యత్యాసం గ్రహించాలని అన్నారు. స్థానిక సెంచూరియన్ వర్సిటీలో మూడో ఉత్కళ కృషి మేళా 2025 మంగళవారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఒడిషా మిల్లెట్ క్వీన్ డాక్టర్ రైమతీ ఘురియా, సంజీవనీ ఎన్.జి.ఓ.(ఆంధ్రప్రదేశ్) దేవులు పచేరీ తదితరులు పాల్గొన్నారు. గుమ్మా సమితికి చెందిన గిరిజన మహిళలు తృణధాన్యాలు అయిన రాగులు, జొన్నలు, చోడి పంటల అనుభావాన్ని తెలియజేశారు. బీఎస్సీ (అగ్రి) విద్యార్థి దిలీప్ బరాల్ సంబల్‌పురి డ్యాన్స్ వేసి అందరినీ అలరించారు. రైస్ మేన్ ఆఫ్ ఒడిషా సుధాం సాహు, మయూర్‌భంజ్ నుంచి ప్రోగ్రెసివ్ ఫార్మర్ ప్రహ్లాద మహంత, భూదేవి పాల్గొని వేదికపై మాట్లాడారు. వారిని సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎస్.రావు జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ఆయన వ్యవసాయ, పశుపాలన, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్స్‌ను సందర్శించారు.



వ్యవసాయంలో డ్రోన్స్ పనితనం వివరిస్తున్న డీన్ సత్యప్రకాష్ నంద

మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



యశోద దాస్

భువనేశ్వర్: పోలీసు బ్యారక్ లోపల మహిళా (యువతి) కానిస్టేబుల్ మృతి అనుమానాస్పదంగా మారుతోంది. మృతురాలిని యశోద దాస్‌గా గుర్తించారు. ఈమె స్వస్థలం రెముణా పోలీస్ ఠాణా పరిధిలోని మందొర్‌పూర్ గ్రామం. బాలాసోర్ జిల్లా పోలీసు బ్యారక్ లోపలి ప్రాంగణంలో మంగళవారం ఈ విషాద సంఘటన హృదయం కలచి వేసిందని తోటి సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. తెల్లవారు జామున బ్యారక్ లోపల యశోద వేలాడుతూ ఉండటాన్ని తోటి కానిస్టేబుళ్లు గమనించారు. వారు ఆమెను రక్షించడానికి సమయం వృధా చేయకుండా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు.

మృతురాలి సోదరుడు టుటు దాస్ మాట్లాడుతూ .... పోలీసులు ఆమె ఫోన్, చాట్ వివరాలను పరిశీలించాలని అభ్యర్థించాడు. తన సోదరితో సంబంధం ఉన్న వారి కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని భోరుమన్నాడు. ఎలాంటి సూసైడ్ నోట్ లభ్యం కాలేదని పోలీసులు ప్రకటించారు. బాలాసోర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటనపై విచారణ జరుగుతోందని, ప్రారంభ పరిశోధనల ప్రకారం ఈ విషాదం వెనుక వ్యక్తిగత కారణాన్ని సూచిస్తున్నాయని ఆయన ధ్రువీకరించారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారికి చేసిన పుష్పాలంకరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు అప్పలనాయుడు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో గల ఎర్ర చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో అటువైపు వెళ్లిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడిని నరవగ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడుగా గుర్తించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: కోరుకొండ రైల్వేస్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు విజయనగరం రైల్వే పోలీసులకు సమాచారం లభించింది. ఇందుకు సంబంధించి జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. విజయనగం–కోరుకొండ రైల్వేలైన్ ప్రాంతం గుండాలపేట వద్ద 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది గుర్తించారు. అయిదున్నర అడుగుల పొడవు కలిగి ఉండి బూడిద రంగు చొక్కా, బిస్కెట్ రంగు ఫ్యాంట్ ధరించిన వ్యక్తి రైలు పట్టాలపై పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చిన మేరకు జీఆర్పీ హెచ్‌సీ క్రిష్ణారావు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుర్తించిగలిగే వారు ఎవరైనా ఫోన్ 9490617089, 9441013330, 08912883218 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వెట్టిచాకిరీ ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం



డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ సామాజిక వర్గ దంపతుల వెట్టిచాకిరీ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆదేశించారు. తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ నంబూరి పద్మ, అగ్రి దంపతులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన బాపట్ల కలెక్టర్‌ను చైర్మన్ అభినందించారు. వెట్టిచాకిరీ చేయించడంతో పాటు, ఆ దంపతులను అమ్మకానికి పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం తీరుపై నిరసన

శృంగవరపుకోట: గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వినిపించేందుకు ఎస్.కోట మండలంలోని ధారపర్తి పంచాయతీ వాసులు సోమవారం మండుటెండలో విశాఖ– అరకు రోడ్డులో ఎదురు చూశారు. ఆయన కాన్వాయ్ ఆగకుండా వెళ్లిపోవడంతో నిరాశ చెందారు. దీనికి నిరసనగా బొడ్డవర నుంచి ఎస్.కోట వరకు మంగళవారం పాదయాత్రగా వచ్చి ఎండీఓకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, ధారపర్తి సర్పంచ్ సన్నిబాబు, మాజీ సర్పంచ్ ఎం.బుచ్చన్న, ఎర్రయ్య, అరుణ్, జోషి తదితరులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలకు డోలీ మోతలు తప్పడం లేదన్నారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాలు అక్కరకు రావడం లేదని వాపోయారు. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేవారే కరువయ్యారన్నారు. ఎన్నికల సమయంలో గిరిజనులపై చూపించే ప్రేమ తర్వాత నేతల్లో కరువవుతోందన్నారు. గిరిజనుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేవారే లేరని వాపోయారు.

పరిశ్రమలు లేవు..
ఉపాధి ఊసే లేదు

- పదినెలలు గడుస్తున్నా కానరాని పరిశ్రమలు
- నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ అంటూ ఎన్నికల ప్రచారం
- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఒకటే పార్క్ లేఅవుట్
- మిగిలిన మూడు నియోజక వర్గాల్లో ప్రతిపాదనలకే పరిమితం
- జిల్లాలో అధిక మొత్తంలో గిరిజన ఉత్పత్తులు
- పరిశ్రమలు లేక దళారుల పాలవుతున్న ఉత్పత్తులు



ప్రతిపాదనలకే పరిమితం

పార్వతీపురంటౌన్: ఎన్నికల ముందు అధికారం దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టిసారించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఉదరగొట్టి అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి పదినెలలు గడుస్తున్నా ఆచరణలో ముందడుగు వేయడం లేదు. అధికారం చేపట్టిన తరువాత జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ పార్కులు ఏర్పాటు చేస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో ఒక్కో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసి చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కుల్లో మౌలిక వసతులు కల్పించి పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న ఆశలను యువతలో కల్పించారు. తీరా పదినెలలు గడుస్తున్నా పరిశ్రమల ఊసెత్తక పోవడంతో యువతలో ఆందోళన నెలకొంది.

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు, గిరిజన ఉత్పత్తులు జిల్లాలో మెండుగా ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో భూములు సైతం ఉన్నాయి. కానీ ప్రభుత్వం, అధికారుల మధ్య సమన్వయ లోపంతో జిల్లాలో ఇప్పటివరకు ఒక్క పరిశ్రమకు గాని, పరిశ్రమల ఏర్పాటుకు గాని చర్యలు చేపట్టడం లేదు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారే తప్ప పనులు మాత్రం జరగడం లేదు. చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నప్పటికీ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు, వాటిలో సౌకర్యాలు కల్పించేందుకు సరైన స్పష్టత లేకపోవడంతో పరిశ్రమలను ఏవిధంగా ఏర్పాటు చేస్తామని ఔత్సాహికులు వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

పార్వతీపురం నియోజకవర్గంలోని పార్వతీపురం మండలంలో గల చందలింగి గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం మండలం చిలకాం గ్రామంలో స్థల పరిశీలన చేశారు. పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలం పణుకువలస గ్రామ సమీపంలో లే అవుట్లు పరిశీలించి మంజూరు చేశారు. ప్రస్తుతానికి ఎటువంటి పనులు ప్రారంభించలేదు. సాలూరు నియోజకవర్గంలో స్థల పరిశీలన, ప్రతిపాదనలు వంటివి కనీసం మొదలు పెట్టలేదు. జిల్లాలో చిన్నపరిశ్రమల ఏర్పాటు కలగానే ఉందంటూ స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కోసం ప్రతి నియోకవర్గంలో 50 ఎకరాలకు తగ్గకుండా భూములు గుర్తించాలి. ఇక్కడ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో స్థల సేకరణకు అధికారులు నానా పాట్లు పడుతున్నారు.

స్థల పరిశీన చేశాం

ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో గల కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూములు గుర్తిస్తున్నాం. కొన్నిచోట్ల భూములు అందుబాటులో ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో స్థల పరిశీలనకు చర్యలు చేపట్టాం. స్థలాలు గుర్తించిన వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

– ఎంవీ కరుణాకర్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్

ప్రత్యేకాధికారుల నియామకం..

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని నియోజకవర్గాలు, మండలాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. మండల అభివృద్ధిపై వారు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తారన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలు తనిఖీ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మండలాల వారీగా ప్రత్యేకాధికారులు

మండలం	అధికారి
పాచిపెంట	జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రామకృష్ణ.
బలిజిపేట	జిల్లా వ్యవసాయశాఖాధికారి కె. రాబర్ట్‌పాల్
గరుగుబిల్లి	జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ఒ.ప్రభాకరరావు
మక్కువ	జిల్లా ఉద్యానశాఖాధికారి బి.శ్యామల
పార్వతీపురం	డీఆర్‌డీఏ పీడీ సుధారాణి
కొమరాడ	జిల్లా భూగర్భ జలాల అధికారి ఎ.రాజశేఖరరెడ్డి
సీతానగరం	సివిల్ సప్‌లైస్ డీఎం ఐ.రాజేశ్వరి
సాలూరు	జీసీసీ డీఎం మహేంద్ర కుమార్
పాలకొండ	జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు
వీరఘట్టం	సీపీఓ వీర్రాజు
గుమ్మలక్ష్మీపురం	ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ
కురుపాం	సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్ తేజేశ్వరరావు
సీతంపేట	పాలకొండ డివిజనల్ అభివృద్ధి అధికారి వీవీ గోపాలకృష్ణ భామిని, డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు
జియ్యమ్మవలస	జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు

నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు

పార్వతీపురం నియోజకవర్గానికి ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాం నియోజకవర్గానికి కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రా రెడ్డి, సాలూరు నియోజకవర్గానికి డ్వామా పీడీ రామచంద్రా రెడ్డిని నియమించారు.

'మున్సిపాల్టీల ప్రత్యేకాధికారులు

సాలూరు మున్సిపాల్టీకి డీవీఈఓ డి.మంజులావీణ. పార్వతీపురం మున్సిపాల్టీకి ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, పాలకొండ మున్సిపాల్టీకి సీతంపేట ఏపీఓ జి.చినబాబులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో బంగారు పతకాలు



పలు క్రీడాంశాల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వైవీ.ప్రసాద్, రమణిప్రియ

చీపురుపల్లిరూరల్(గరివిడి): అంతర్జాతీయస్థాయిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్ క్రీడల పోటీల్లో గరివిడి పట్టణానికి చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఏప్రిల్ 3 నుంచి 7వరకు ఎస్‌బీకేఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నేపాల్ దేశంలో జరిగిన ఈ క్రీడాపోటీల్లో మహిళల విభాగంలో పవర్ లిఫ్టింగ్ క్రీడాంశంలో రాజమహంతి రమణి ప్రియ 330 కేజీల బరువును ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారుపతకం, షాట్‌పుట్, డిస్కత్రో పోటీల్లో కూడా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. పురుషుల విభాగంలో పవర్ లిఫ్టింగ్‌లో వైవీ.ప్రసాద్ 400 కేజీల బరువును ఎత్తి ప్రథమ స్థానంలో స్వర్ణ పతకం, అలాగే 50 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకం,100 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం: క్రీడారంగంలో అత్యంత ఆదరణ కలిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో క్రీడాకారులు పోటీ పడుతుంటారని, వారిలో ప్రతిభ కనబరిచిన వారిని పారదర్శకంగా ఎంపిక చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయనగరం ఎంపీ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిశెట్టి అప్పలనాయుడు స్థానిక విజ్జి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి అండర్–19 క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారుల ప్రతిభను అడిగి తెలుసుకుని, లక్ష్యం కోసం కష్టపడాలని సూచించారు. ఎంపిక పోటీల్లో విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాంబాబు, ట్రెజరర్ వర్మరాజు, అసోసియేషన్ సభ్యులు, హెడ్ కోచ్‌లు పాల్గొన్నారు.

గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

పార్వతీపురం: గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో జీడి పిక్కల కొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల కొనుగోలుకు సంబంధించి 8 మండలాల్లో 20 గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జీడి కనుగోళ్ల యాప్ నిర్వహణపై ఈనెల 9న శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 10, 11 తేదీల్లో రస్తా కుంటుబాయిలో 8 మండలాల గ్రామస్థాయి కమిటీ సభ్యులకు కేవీకేలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ తదితరులున్నారు.

డ్రగ్స్ నియంత్రణకు సమన్వయంతో పని చేయాలి

- అదనపు ఎస్పీ సౌమ్యలత



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్:

డ్రగ్స్ నియంత్రణకు అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని జిల్లా అదనపు ఎస్పీ సౌమ్యలత అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఏఎస్పీ పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్య రహిత జిల్లాగా విజయనగరం ఉండేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టేందుకు ప్రభుత్వం ఈగిల్ అనే ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ వింగ్‌కు ప్రతి ఒక్కరూ, ప్రతి ఒక్క శాఖ తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. గంజాయి వ్యసనానికి అలవాటు పడిన వారిని గుర్తించి సన్మార్గంలో పెట్టేందుకు అందరూ కృషి చేయాలని ఏఎస్పీ సౌమ్యలత సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం, ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు, డిజేబుల్ వెల్ఫేర్ ఆఫీసర్ అన్నపూర్ణ, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు లలిత, త్రినాథ్ రావు, డిస్ట్రిక్ సర్వేలైన్స్ అధికారి డా.సత్యనారాయణ,సెట్విజ్ సీఈఓ సోమేశ్వరరావు,ఈగిల్ జేఓ ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్ పరీక్షలో విజేతలకు అభినందన



బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో అర్హత సాధించిన క్రీడాకారులు

విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో అర్హత పొందిన క్రీడాకారులను హోటల్ జీఎస్ఆర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు అభినందించారు. ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్షలో వి.రోహిణి, చరిష్మా, కె.నిత్య, డి.ప్రియవల్లి, దేవన్ ఫస్ట్ డాన్ బ్లాక్‌బెల్ట్ సాధించగా..వి కుశాల్, పి.పునీత్, ఎస్.సాత్విక్, వై. ముఖేష్, టి.సంకీర్తన, వి.యశ్మిత, సూర్య, కె.సాహిత్య సెకెండ్ డాన్ బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో అర్హత సాధించారు. వారికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, సత్య ఐటీఐ విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లు శ్రీకాంత్ సర్టిఫికెట్‌లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, రాజేష్, కోచ్ యశస్విని పాల్గొన్నారు.

సిబ్బంది అవసరాల కోసం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

- ఎస్పీ వకుల్ జిందల్
- డీపీఓలో కో ఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం



కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పోలీస్‌సిబ్బంది అవసరాలకు అనుగుణంగా కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పని చేస్తోందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వార్షిక సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎస్పీతోపాటు ఏఎస్పీ సౌమ్యలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి అవసరార్థం ఆర్థికపరంగా ఆదుకోవడానికి క్రెడిట్ సొసైటీ ఏర్పాటు జరిగిందన్నారు.తక్కువ వడ్డీకి కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. కుటుంబ అవసరాలైన పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణాల కోసం సిబ్బంది పే స్కేల్ ఆధారంగా రుణాలు పొందవచ్చని చెప్పారు. కాగా 2024–2025 ఆదాయ వ్యయాల,సంక్షేమానికి సొసైటీ తీసుకున్న, అమలు చేసే చర్యలను సభ్యులకు ఎస్పీ తెలియజేశారు. సిబ్బంది తీసుకున్న సభ్యత్వం,సర్వీస్ ఆధారంగా ఇప్పటికే రూ. మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు వ్యక్తిగత రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్‌లో భాగంగా కో ఆపరేటివ్ సభ్యత్వం కలిగిన టెన్త్, ఇంటర్ చదివిన సిబ్బంది పిల్లలకు రూ.లక్షా,87 వేల 500 స్కాలర్‌షిప్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పిల్లలు ఎక్కడ చదువుతున్నదీ?ఎంత ర్యాంక్ తెచ్చుకున్నారు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్పీ సీఐ చౌదరి, ,ఏఆర్ ఆర్ఐ గోపాలనాయుడు కో ఆపరేటివ్ సెక్రటరీ నీలకంఠం నాయుడు, డైరెక్టర్లు రామకృష్ణ, ఈశ్వరరావు, విజయ్‌చందర్, చిన్నారావులతో పాటు,పోలీస్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3.75 లక్షల స్త్రీనిధి సొమ్ము రికవరీ!

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాల స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టాయన్న ఆరోపణలతో కొంత మంది సభ్యులు జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెలుగు అధికారులు కొద్దిరోజులుగా విచారణ జరిపారు. 10 పొదుపు సంఘాల్లోని 7 సంఘాల రికార్డులు పరిశీలించారు. రూ.3.75 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. వీఓఏ నుంచి కొంత మొత్తం ఇప్పటికే రికవరీ చేశామని, మొత్తం సొమ్ము రికవరీ చేస్తామని వెలుగు ఏపీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. మరో మూడు సంఘాలను విచారణ జరపాల్సి ఉందన్నారు.

అలజంగి గ్రామంలో..

మండలంలోని అలజంగి గ్రామంలో 108 పొదుపు సంఘాలుండగా గత పదేళ్లలో కోటి రూపాయల మేర రుణాల మంజూరు, రికవరీలో వీఓఏ చేతివాటం చూపినట్టు గ్రామానికి చెందిన 30 సంఘాల సమాఖ్య సభ్యులు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ వేగంగా పూర్తయ్యేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే బేబినాయనకు మంగళవారం విజ్ఞప్తిచేశారు.

వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి



ఆశకార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె ఆశ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1775 మంది ఆశ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సదుపాయాలు అందించడంలో ఆశ కార్యకర్తలు ప్రముఖ పాత్ర వహిస్తున్నారన్నారు. ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను ముందు స్థాయిలో నిలబెడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆశ జిల్లా కో ఆర్డినేటర్ బి.మహాలక్ష్మి, సీహెచ్ఓ చంద్రశేఖరాజు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చి దిద్దుతాం

- ఎక్సైజ్ శాఖాధికారి బి. శ్రీనాథుడు
- ఏఓబీ గ్రామాల్లో ఎక్సైజ్ సంయుక్త దాడులు



ఏఓబీ గ్రామాల్లో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురం టౌన్:

సారా నియంత్రణే ధ్యేయంగా ఎక్సైజ్‌శాఖ పనిచేస్తుందని, సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి బి. శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ సిబ్బందితో మంగళవారం సరిహద్దు గ్రామాలైన సులభ, పెండిమ, కెరడ, వలవ, వనజ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాడుల్లో 11,200 పులిసిన బెల్లపు ఊట, 200లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా తయారీకి వినియోగిస్తున్న ప్లాస్టిక్ డ్రమ్ములు, బకెట్లు, నల్లబెల్లం వంటివి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో తయారైన సారా పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం వరకు అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఈ రవాణాను అరికట్టేందుకు సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా కనీసం మూడుసార్లు అంతర్‌రాష్ట్ర దాడులు నిర్వహిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో డ్రోన్ పరికరాలను ఉపయోగించి సారా తయారీ కేంద్రాలను గుర్తించి మరిన్ని దాడులు నిర్వహిస్తామన్నారు. ఈ దాడుల్లో ఏఈఎస్ జీవన్ కిశోర్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్:

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురజాడ అప్పారావు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.జ్యోతిశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీలోగా కస్పా హైస్కూల్ వద్ద ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ మార్క్స్ జెరాక్స్, రెండుపాస్ ఫొటోలు దరఖాస్తుకు జతచేయాలన్నారు. వివరాలకు సెల్: 96035 57333, 9177 726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. తహసీల్దార్లు, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లతో కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపన్ను, పీజీఆర్ఎస్ గ్రీవెన్స్, 22ఏ పెండింగ్ దరఖాస్తులు, రీవెరిఫికేషన్ ఆఫ్ హౌస్ సైట్స్, రెగ్యులరైజేషన్ ఆఫ్ హౌస్ సైట్స్, హౌస్‌సైట్స్ అసైన్మెంట్, ఫ్రీహోల్డ్ స్టేటస్, ఏపీసేవా సర్వీసెస్, రీసర్వే రెండవ దశపై మండలాల వారీగా సమీక్షించారు. పీజీఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చూడాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్ అధికారులు సత్యవాణి, రామ్మోహన్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.